కథ

# మార్కండేయులు చాలా మారిపోయాడు

ఆకునూరి మురళీకృష్ణ

"ఏమండోయ్..విచిత్రం! విన్నారా?" అప్పటిదాకా మాట్లాడుతున్న సెల్‌ఫోన్ ఆఫ్ చేసి హాల్లో సోఫాలో కూర్చుని పేపరు చదువుకుంటున్న రామాంజనేయం దగ్గరికి వస్తూ చాటంత ముఖం చేసుకుని అంది రుక్మిణి.

మొబైల్ నెట్‌వర్కుల వాళ్ళు వాళ్ళ సేల్సు పెంచుకోవడానికి రోజుకోరకమైన ప్యాకేజీలని ప్రకటించడం, వాళ్ళు ప్రకటించిన ఆ అర్థంపర్థం లేని ప్యాకేజీలవల్ల ఎవరెవరో బీరకాయపీచు బంధువులకో స్నేహితులకో వున్న ఫోన్లకి ఉచితంగానో సగం రేటుకో ఫోన్లు చేసే అవకాశం రావడం ఈ రోజుల్లో మామూలైపోయింది. అలా వచ్చే ఏ అవకాశాన్ని వదులుకోకుండా రుక్మిణి అవసరమున్నా లేకపోయినా వాళ్ళకి ఫోన్ చేసి, అర్థమైన ఇన్ఫర్మేషనూ పోగుచేసి చివరికి "విన్నారా?" అంటూ విన్నా వినకపోయినా తన దగ్గరికి వచ్చి అదంతా చెప్పడం బాగా అలవాటైపోయిన రామాంజనేయం "ఎలా వింటానూ నువ్వు చెప్పందే?" అన్నాడు చాలా మామూలుగా. పేపరు మీద నుంచి కళ్ళు తిప్పకుండానే.


"మా మార్కండేయులు అన్నయ్య సుచిత్రా వాళ్ళకీ ఫోన్ చేసి ఈ ఆదివారం వాళ్ళింటికి లంచ్‌కి రమ్మన్నాట్ట!" అంది రుక్మిణి వచ్చి రామాంజనేయం పక్కనే సోఫాలో కూర్చుంటూ.

ఈసారి మాత్రం రుక్మిణి మాటలకి కళ్ళు పెద్దవి చేసాడు రామాంజనేయం. ప్రపంచంలో ఎనిమిదో వింతని గురించి విన్నట్లుగా అబ్బురపడుతూ చూసాడు. పేపర్లోంచి కళ్ళేకాకుండా తలా, కాళ్ళూ చేతులూ కూడా ఎత్తేసి పేపరు పక్కన పడేస్తూ "నిజమా?" అన్నాడు ఆశ్చర్యంగా.

"నిజమేనండీ..ఇప్పుడే సుచిత్ర ఫోన్ చేసింది. రమ్మని మరీ మరీ చెప్పాట్ట. రాకపోతే తనమీద ఒట్టే అన్నాడుట. వాడు అంత ప్రేమగా పిలవడం పుట్టి బుద్ధెరిగాక నేను చూడలేదే అని అదే నమ్మలేకపోతోంది"

"అవునా? ఇది నిజంగా విచిత్రాల్లోకెల్లా విచిత్రమే. ఎవరితోనూ కలవకుండా, మాట్లాడకుండా ఎప్పుడూ ముఖం మాడ్చుకుని వుండే మీ మార్కండేయులు అన్నయ్యేనా సుచిత్రని అంత ప్రేమగా పిలిచింది? ఇందులో ఏదో తిరకాసు వుండే వుంటుంది. సుచిత్రతో ఏదో అవసరం వచ్చి వుంటుంది. అందుకే అంత ప్రేమగా పిలిచాడు" అన్నాడు రామాంజనేయం.

మార్కండేయులు రుక్మిణికి దూరపు వరుసలో కజిన్ బ్రదర్ అవుతాడు. బంధువర్గంలో అతడికో ప్రత్యేకత వుంది. ఎవరితో కలవకపోవడం, మాట్లాడకపోవడమే కాకుండా పొరపాట్న అభిమానం కొద్దీ ఇంటికి ఎవరైనా వచ్చినా కూడా వాళ్ళ ముఖం మీదే ముఖం మాడ్చుకోవడం, అతిథులని కూడా చూడకుండా వాళ్ళని కించపరిచేట్టు మాట్లాడడం అతడి ప్రత్యేకత.



అతడి గురించి బంధువర్గంలో కథలు కథలుగా చెప్పుకుంటారు. ఇంట్లో భార్యకి కూడా సరుకులు రేషన్ పద్ధతిలో ఇస్తాడని, సిటీబస్సులో కూడా కండక్టర్‌తో టిక్కెట్టు గురించి బేరమాడతాడనీనూ! అవసరం లేందే అతడు ఎవరితోనూ మాట్లాడడు ఎనర్జీ దండుగని. అలాగే ఎవరైనా తనతో మాట్లాడబోతే వాళ్ళకి తనతో ఏ అవసరం వుందో ఏం సాయం చేయాల్సి వస్తుందోనని ముఖం చాటేస్తాడు. పొరపాట్న ఎవరైనా పలకరిస్తే వాళ్ళ ముఖం మీదే వాళ్ళని అవమానపరిచేలా ఏదో మాట అనేసి వాళ్ళని రెండో మాట మాట్లాడనీయకుండా చేస్తాడు. ఆ నేర్పు మాత్రం అతడికి బాగా వుంది. అతడి ధోరణికి బలి కానివాళ్ళు వాళ్ళ బంధువర్గంలోనే లేరంటే అది అతిశయోక్తి కాదు!

అలాంటి మార్కండేయులు ఇంటికి ఒకసారి వెళ్ళాల్సి వచ్చింది రామాంజనేయానికి. మార్కండేయులు వాళ్ళ బామ్మగారు చనిపోయారని తెలిసి ఆ సమయంలో తను ఊర్లో లేకపోవడంతో పలకరించకపోతే బాగోదని ఊరి నుంచి వచ్చాక వాళ్ళింటికి బయలుదేరదీసింది రుక్మిణి. మార్కండేయులు గురించి అంతకుముందే విన్న రామాంజనేయం భయపడితే అతడ్ని కోప్పడి "ఇలాంటి సమయంలో ఎంతటి వాళ్ళయినా మనుషులకోసం తపిస్తారు. సానుభూతి చూపించడం మన ధర్మం" అని పోరుపెట్టి వాళ్ళింటికి తీసుకెళ్ళింది.

"సారీ మార్కండేయులు గారూ మీ బామ్మగారు పోయారని తెలిసింది?" అన్నాడు రామాంజనేయం విచారంగా ముఖం పెట్టుకుని.

మార్కండేయులు రామాంజనేయాన్ని విసుగ్గా చూసాడు "మా

బామ్మగారు పోతే మీరెందుకు పనిగట్టుకుని వచ్చి నాకు సారీ చెప్పడం? మీరే ఆవిడని చంపలేదుగా?" అన్నాడు.

అతడి మాటలకి బుర్ర తిరిగిపోయింది రామాంజనేయానికి. ఆ పలకరింపునకు అలా కూడా సమాధానం చెప్పవచ్చని అంతవరకూ ఎవరూ ఊహించి వుండరు. అతడిని గురించి వినివుండడమే కానీ ప్రత్యక్షంగా అనుభవం కావడం అదే మొదటిసారి. ఏమ్మాట్లాడాలో అర్థం కాలేదు. మార్కండేయులు భార్యా పిల్లలూ అతడి వంకా, రుక్మిణి వంకా నొచ్చుకుంటున్నట్లు చూడటం మినహా మరేం చేయలేకపోయారు.



అంతటితో ఊరుకోకుండా మాటల మధ్య చావు పుట్టుకలూ, చిన్న చిన్న విపత్తులూ, సంతోషాలూ వంటివి సంభవించడం జీవితంలో ఎంత సహజమో వివరిస్తూ వాటినడ్డం పెట్టుకుని పలకరింపులంటూ మనుషులు ఎంత సమయాన్ని వృథా చేసుకుంటారో, ఆ వచ్చినవాళ్ళవల్ల ఇంట్లోవాళ్ళు ఎంత ఇబ్బందిపడతారో, వాళ్ళ కాఫీ టీలకి ఎంత వృథా ఖర్చో వివరించాడు. తమని దెప్పుతున్నట్లు కాకుండా ఏదో మాటల సందర్భంలో అంటున్నట్టే అన్నీ అన్నాడు.

వింటున్న రామాంజనేయం 'బుద్ధితక్కువై మిమ్మల్ని పలకరించడానికి వచ్చాను' అని మనసులో తనని తనే తిట్టుకుంటూ రుక్మిణి వంక మింగేసేలా చూసాడు. చేసేది లేక ముళ్ళ మీద కూర్చున్నట్లు మరో పది నిమిషాలు కూర్చుని 'బ్రతుకుజీవుడా' అనుకుంటూ బయటపడ్డారు అక్కడినుంచి. అదే మొదటిసారీ, చివరిసారీ వాళ్లింటికి వెళ్ళడం. ఆ తరువాత ఏ పెళ్ళిళ్ళలోనైనా ఫంక్షన్లలోనైనా అతడు కనిపిస్తే చాలు, ఏదో పనున్నట్టు తప్పించుకుని తిరగడం అలవాటు చేసుకున్నాడు.

మొన్ననే అతడు కొత్త ఇల్లు కట్టుకుని మొహమాటం కొద్దీ గృహప్రవేశం శుభలేఖ పోస్టులో పంపిస్తే సరిగ్గా అదే సమయానికి పనిగట్టుకుని మరీ తిరుపతి ప్రోగ్రాం వేసుకుని ఊర్లో వుండకుండా వెళ్ళిపోయారుగానీ ఆ శుభకార్యానికి వెళ్ళే సాహసం మాత్రం చేయలేకపోయారు. వచ్చాక తెలిసింది...ఊళ్ళో ఉన్న మిగిలిన బంధువులు కూడా తమలాగే ఏదో వంక పెట్టుకుని ఆ గృహప్రవేశానికి వెళ్ళకుండా తప్పించుకున్నారని.

"మా మార్కండేయులు అన్నయ్యకి సుచిత్ర వల్ల అయ్యే పనేముంటుంది?" ఆలోచిస్తున్నట్టుగా అంది రుక్మిణి.

"ఇంతకీ మీ సుచిత్ర వెడుతోందటనా?" అన్నాడు రామాంజనేయం.

"అంత ప్రేమగా ఒళ్లేసి మరీ పిలిచాడు వెళ్ళకపోతే ఏం బావుంటుందీ అంటోంది. అయినా మనుషులు ఎల్లకాలం ఒకేలా వుంటారా? వాడికి మాత్రం వయసు రావడం లేదా? బంధువుల విలువ తెలుస్తోందేమో" అంది రుక్మిణి.

అతడికి నవ్వొచ్చింది. మార్కండేయులుని ప్రత్యక్షంగా చూసాక అలాంటి మనిషిలో నడెన్‌గా అంతటి మార్పు వస్తుందంటే అతడు నమ్మలేకపోతున్నాడు. 'ఖచ్చితంగా ఇందులో ఏదో తిరకాసు వుండే వుంటుంది. ఏదేమైనా ఆదివారం సుచిత్ర వెళ్ళి వచ్చాక కానీ అసలు విషయం తెలియదు" అనుకున్నాడు.

☆☆☆

ఆ ఆదివారం రాత్రి ఫ్రీ కాల్స్ ఏమీ లేకపోయినా సుచిత్రకి ఫోన్ చేయకుండా వుండలేకపోయింది రుక్మిణి. ఆమె ఫోన్లో మాట్లాడుతున్నంతసేపూ కాలుగాలిన పిల్లిలా అక్కడక్కడే తిరుగాడాడు రామాంజనేయం.

ఆమె ఫోన్ పెట్టెయ్యగానే "మీ సుచిత్ర మార్కండేయులు వాళ్లింటికి వెళ్ళిందటనా? మార్కండేయులు వాళ్ళనెలా రిసీవ్ చేసుకున్నాడుట?" అంటూ ఆతృతగా అడిగాడు.

అతడి ఆతృత చూసి రుక్మిణి నవ్వింది. "వెళ్ళిందట...చాలా ప్రేమగా రిసీవ్ చేసుకున్నాడుట. మార్కండేయులు అన్నయ్య చాలా మారిపోయాడుట. అదే ఇంకా షాక్‌నుంచి తేరుకోలేకపోతోంది. మీరు అనుకున్నట్టు సుచిత్రతో అతడికేమీ పని పడనూ లేదుట. సుచిత్రనేమీ అడగనూ లేదుట!" అంది ఇద్దరికీ కంచాల్లో అన్నం వడ్డిస్తూ.

రామాంజనేయం ఆశ్చర్యంగా నోరువెళ్ళబెట్టాడు. అంతలోనే తేరుకుని తేలిగ్గా అన్నాడు. "ఆ మార్కండేయులు అంత తెలివితక్కువ వాడేం కాదులే. అతడికి సుచిత్రతో ఏదో పెద్ద పనే వుండి వుంటుంది. మొదటిరోజే బయట పడిపోతే బాగోదని మీ సుచిత్రని మెల్లగా మంచి చేసుకుంటున్నాడు. కావాలంటే చూడు, వచ్చే శనివారమో ఆదివారమో ఆమెని మళ్ళీ లంచ్‌కో డిన్నర్‌కో పిలుస్తాడు..అప్పుడు బయటపెడతాడు అసలు సంగతి?"

"ఆ సంగతేమోగానీ, వచ్చేవారం మా వరంగల్ పిన్ని కొడుకు చిన్నికృష్ణని రమ్మని పిలిచాడుట!" అంది రుక్మిణి.

ఆ మాటలకి అప్పుడే ముద్ద నోట్లో పెట్టుకోబోతున్న

## దటీజ్ అనుష్క

అనుష్కకి 'అరుంధతి' సినిమాతో వచ్చిన క్రేజ్ దృష్ట్యా ఆమెకి కోటి రూపాయల పారితోషికాన్ని ఇవ్వడానికి కూడా నిర్మాతలు వెనకాడలేదని టాలీవుడ్‌లో వినిపించింది. అయితే ఆమె 'అరుంధతి' తర్వాత చేసిన 'బిల్లా'కి కేవలం 65 లక్షలే తీసుకుందిట. అలాగే ఆమె కోటి రూపాయలు ఇస్తామని ఎంత మంది నిర్మాతలు ముందుకొచ్చినా కూడా అంతగా ఇష్టపడడం లేదట. మరీ అత్యాశకు పోవడం మంచిది కాదనేది ఆమె ఆలోచన కాబోలు! మంచిదే!

రామాంజనేయానికి పొలమారినట్టయింది. ఆశ్చర్య పోవడమన్నది చాలా చిన్న విషయం అన్నట్టుంది అతడి ఎక్స్‌ప్రెషన్! అది చూస్తే నవ్వాగలేదు రుక్మిణికి.

"ఈ సంగతి ఎవరు చెప్పారు?" అన్నాడు అదే ఎక్స్‌ప్రెషన్‌తో.

"మార్కండేయులు అన్నయ్య వాళ్ళని ఆహ్వానించడం సుచిత్ర చెవులారా విందట. ఇప్పుడే చిన్నికృష్ణ కూడా ఫోన్లో సుచిత్రతో మాట్లాడాడుట. అసలే వాడు మార్కండేయులు అన్నయ్యంటే ఆమడ దూరం పారిపోతాడు. ఇప్పుడు రావాలో వద్దో తెలియక సతమతమౌతున్నాడుట. సుచిత్ర వాడికి ధైర్యం చెప్పి రమ్మందిట"

వింటున్న రామాంజనేయం తన చెవులని తానే నమ్మలేకపోయాడు. నమ్మశక్యంకాక మళ్ళీ మళ్ళీ అడిగి చెప్పించుకున్నాడు.

తమ బంధువుల కబుర్లు అతడు అంత ఆసక్తిగా వినడం తెగ ఆనందాన్నిస్తుండగా ఉత్సాహంగా చెప్పుకుపోసాగింది రుక్మిణి.

"పీనాసివాడైనా మా మార్కండేయులు అన్నయ్య ఇల్లుమాత్రం ఇంద్రభవనంలా కట్టుకున్నాట్టండీ..లంకంత కొంపలో అందరికీ తలో గదీ నట! సుచిత్రకి అంతా దగ్గరుండి అన్నయ్యే చూపించాడుట. మా పెద్దమ్మ రాక రాక వచ్చిన సుచిత్రని చూసి చాలా సంతోషించిందట. అసలు మా అమ్మ అక్కచెల్లెళ్ళంతా మా చిన్నప్పుడు చాలా కలివిడిగా సరదాగా వుండేవాళ్ళు. మా పెద్దమ్మకి మార్కండేయులు అన్నయ్య ఒక్కడే సంతానం. వాడికి భయపడి మేమెవరమూ వాళ్ళింటికి వెళ్ళడం లేదుగానీ, మేమంటే మా పెద్దమ్మకి ప్రాణం. ఇన్నాళ్ళకి వాడు మారి మమ్మల్ని కలుపుతున్నాడు"

రామాంజనేయానికి రుక్మిణి చెప్పేదేమీ తలకెక్కడం లేదు. మార్కండేయులు మారిపోయాడంటే అతడికెందుకో నమ్మశక్యం కావడం లేదు. అతడే కాదు..మార్కండేయులు గురించి తెలిసిన వాళ్ళెవరూ అతడు మారిపోయాడంటే నమ్మలేరు.

☆ ☆ ☆

ఆ ఆదివారంనాడు రాత్రి రుక్మిణితో అన్నాడు రామాంజనేయం "మీ వరంగల్ చిన్నికృష్ణకొకసారి ఫోన్ చేయి"

"వాళ్ళకీ మనకీ ఫ్రీకాల్సు లేవండీ" అంది రుక్మిణి.

"నా బొంద..ఫ్రీకాల్సు లేకపోతే పెయిడ్ కాల్సు. ఏదో ఒకటి చేయి. ఫోన్ చేయడానికి వుండాల్సింది అవసరం..ఫ్రీకాల్సు కాదు" అన్నాడు విసుగ్గా.

రుక్మిణి మారు మాట్లాడకుండా చిన్నికృష్ణకి ఫోన్ చేసింది. రుక్మిణి మాట్లాడి చెప్పేదాకా కూడా ఆగలేక రామాంజనేయం ఫోన్ అందుకుని తనే చిన్నికృష్ణతో మాట్లాడాడు. అతడు కూడా సుచిత్ర చెప్పినట్టే చెప్పాడు.

"మా మార్కండేయులు అన్నయ్య చాలా మారిపోయాడు బావగారూ..నేను పుట్టి బుద్ధెరిగాక అన్నయ్య నాతో అంత ప్రేమగా మాట్లాడడం ఎరుగను!"

ఆ తరువాత ఆదివారం మౌలాలీలో వుంటున్న రుక్మిణి చెల్లెలు కళ్యాణి మార్కండేయులు వాళ్ళింటికి వెళ్ళింది అతడి ఆహ్వానం మీద. అక్కడినుంచి వెడుతూ వెడుతూ కళ్యాణీ, ఆమె భర్తా దారిలో వున్న రుక్మిణి వాళ్ళింటిని విజిట్ చేసి అక్కడి విశేషాలు చెప్పి మరీ వెళ్ళారు. వాళ్ళు చెప్పింది కూడా అదే మాట.. "మార్కండేయులు చాలా మారిపోయాడు"

వింటున్న రామాంజనేయానికి జుట్టు పీక్కోవాలనిపించింది.



☆ ☆ ☆

ఆ శనివారం మధ్యాహ్నం ఆఫీసునుంచి ఇంటికి వచ్చిన రామాంజనేయునికి బాంబు లాంటి వార్త చెప్పింది రుక్మిణి.

"మా మార్కండేయులు అన్నయ్య ఫోన్ చేసాడండీ..రేపు మనల్ని వాళ్ళింటికి భోజనానికి రమ్మని పిలిచాడు!"

రామాంజనేయం అదిరిపడ్డట్టుగా చూసాడు. తమ వంతు అంత తొందరగా వచ్చేస్తుందని అతడు ఊహించలేదు. అసలేమిటి మార్కండేయులు? ఇలా ఒకళ్ళ తరువాత ఒకళ్ళనీ ఎందుకు పిలుస్తున్నాడు? అంతగా బంధువుల మీద ప్రేమ పొంగుకొస్తే అందరినీ ఒకేసారి పిలవచ్చుకదా?

అయినా అంతకుముందు పలకరించడానికి వెళ్లేనే ముఖం మాడ్చుకునే అతడు సడెన్‌గా ఎలా మారిపోయాడు? అతడికిగానీ మతి భ్రమించలేదుకదా?

అంతా చాలా సస్పెన్సుగా అనిపించింది. ఆ సస్పెన్సు వీడాలంటే తాము వాళ్ళింటికి వెళ్ళితీరాలి. ఎవరూ కనిపెట్టలేకపోయిన విషయాన్ని కొంతైనా తను కనుక్కోవాలి. ఆ కృత నిశ్చయంతోనే పులి బోనులోకి అడుగు పెడుతున్న జింకపిల్లలా వాళ్ళింటికి వెళ్ళేందుకు రుక్మిణికి తన అంగీకారాన్ని తెలియజేసాడు.

☆ ☆ ☆

మార్కండేయులు చెప్పిన అడ్రస్ ప్రకారం వాళ్ళు కొత్తగా కట్టుకున్న ఇంటికి చేరుకున్న రామాంజనేయం, రుక్మిణి మొదట ఆ ఇల్లు చూసి ఆశ్చర్యపోయారు. అందరూ తమకి అతిశయోక్తులేమీ చెప్పలేదని వాళ్ళకి అర్థమయింది. ఆ ఇల్లు నిజంగానే ఇంద్రభవనంలా, సినిమా సెట్టింగులా వుంది.

మార్కండేయులు వీళ్ళకి గేట్లోనే ఎదురు వచ్చాడు. ఎన్నడూ లేని విధంగా నవ్వుతూ ఆహ్వానించాడు. మనిషి కూడా ఎక్కడా తొణక్కుండా బెణక్కుండా స్థిరంగా కనిపించడంతో అతడికి మతిస్థిమితం బాగానే వుందని తెలుస్తోంది. వీళ్ళని చూసి లోపలనుంచి రుక్మిణి వాళ్ళ పెద్దమ్మ, మార్కండేయులు భార్య, పిల్లలు సంతోషంగా బయటికి వచ్చారు. హాల్లో కూర్చుని కాసేపు కుశల ప్రశ్నలయ్యాక అన్నాడు మార్కండేయులు "గృహ ప్రవేశానికి రాలేదుగా? రండి..మా ఇల్లు చూద్దురు

## బరువు తగ్గిన విద్య

విద్యాబాలన్ నటిస్తున్న కొత్తచిత్రం ఆమె చెప్పాపెట్టకుండా చేసిన నిర్వాకం వల్ల షూటింగ్ ఆలస్యం అవుతోందిట. ఈమధ్య అందరూ బరువు తగ్గే ప్రయత్నాలు తెగ చేస్తున్నారు కదా! విద్యకి కూడా తను మరీ బొద్దుగా వున్నానని, కాస్త బరువు తగ్గితే ఇంకొంచెం అందంగా కనిపిస్తానని అనుకుని సడెన్‌గా వెయిట్ రిడక్షన్ ప్రోగ్రామ్ పెట్టుకుందిట. దాదాపు 10 కేజీల బరువు కూడా తగ్గిందిట. అందరూ భలే స్లిమ్‌గా బావున్నావు అంటుంటే- ఆమె కొత్త చిత్రం నిర్మాత మాత్రం తను ఆమెకోసం రెడీ చేసిన కాస్ట్యూమ్స్‌ని ఆల్టర్ చేయించడంలో బిజీగా వున్నాట్ట.

గాని"

అందరికీ తనే దగ్గరుండి అన్నీ వివరంగా చెబుతూ గదులన్నీ తిప్పుతూ ఇల్లు చూపించాడు మార్కండేయులు. అంతా అయ్యాక "రండి..బయటున్న లాన్, మేడమీదున్న రూఫ్ గార్డెన్ కూడా చూద్దురుగాని" అన్నాడు.

"అన్నయ్యా..మీ ఇల్లు నిజంగా దేవేంద్రభవనంలా వుంది. చూడడానికే నాకు కాళ్ళు నొప్పి పెడుతున్నాయి గానీ నేను కాసేపు పెద్దమ్మతో కబుర్లు చెప్పుకుంటాను కూర్చుని" అంది రుక్మిణి చనువుగా సిటవుట్లో వున్న సోఫాలో కూలబడుతూ.

"పోనీ మీరు రండి బావగారూ" అన్నాడు మార్కండేయులు రామానుజంతో. అతడిని మాటల్లోపెట్టి తను కనిపెట్టాలనుకుంటున్న రహస్యాన్ని కనిపెట్టడానికి అదే మంచి అవకాశం అనుకుని ఇంటిని గురించి ప్రశ్నలు వేస్తూ అతడి వెంట నడిచాడు రామాంజనేయం.

దాదాపు గంటసేపు వాళ్ళిద్దరూ అలా ఇల్లంతా తిరుగుతూ మాట్లాడుకుంటూనే వున్నారు. అలా మాట్లాడుతుండగా మాట్లాడుతుండగా విషయం అర్థమైపోయింది రామానుజానికి. దేవరహస్యం తెలిసిపోయింది.

ఆనందంతో గట్టిగా అరవాలనిపించింది. కానీ మార్కండేయుల్ని చూసి భయపడి ఊరుకున్నాడు. ఆ రహస్యాన్ని ఎంత తొందరగా రుక్మిణి చెవిలో వేద్దామా అన్న ఆతృతలో వాళ్ళ ఆతిథ్యాన్ని అన్యమనస్కంగానే స్వీకరించి త్వరత్వరగా రుక్మిణిని అక్కడినుంచి బయలుదేరదీసాడు.

మార్కండేయులు మాత్రం వీళ్ళని వదల్లేక వదల్లేక వదులుతున్నట్టుగా వదిలాడు.

"చూసారా! మా మార్కండేయులు అన్నయ్య మారిపోయాడంటే మీరు నమ్మలేదు. ఇప్పటికైనా ఒప్పుకుంటారా వాడు కూడా మనుషుల విలువ తెలుసుకున్నాడని?" సంబరంగా అంది రుక్మిణి ఆటోలో రామాంజనేయంతో.

ఆ మాట కోసమే ఎదురుచూస్తున్న రామాంజనేయం చిద్విలాసంగా నవ్వాడు. "అబద్ధం..మీ మార్కండేయులు అన్నయ్య ఏమీ మారనూ లేదూ, మనుషుల విలువ తెలుసుకోనూ లేదు. అంతా నాటకం" అన్నాడు.

"ఏమిటి మీరంటున్నది?" ఆశ్చర్యంగా అంది రుక్మిణి.

"అవును..నువ్వు సరిగ్గా గమనించలేదేమోగానీ, ఇల్లు చూపిస్తున్న మీ అన్నయ్య కళ్ళల్లో నాకు చంద్రముఖి కనిపించింది" అన్నాడు రామాంజనేయులు నవ్వుతూ.

"చంద్రముఖేమిటండీ? దెయ్యమా?" అంది రుక్మిణి భయంగా.

"దెయ్యం కాదు. కోరిక..తను ఇన్నాళ్ళూ పైసా పైసా కూడబెట్టుకుని లక్షలు పోసి కట్టుకున్న ఇంద్రభవనం లాంటి ఇంటిని అందరూ చూసి మెచ్చుకోవాలనీ, తన గొప్పతనాన్ని పొగడాలన్న బలమైన కోరిక!" అన్నాడు రామాంజనేయం.

రుక్మిణి నమ్మలేనట్లుగా చూస్తుంటే రామాంజనేయం చెప్పుకుపోతున్నాడు. "అసలు ఏ ఫంక్షనుకీ ఎవరినీ పిలవని మార్కండేయులు గృహప్రవేశానికి కార్డులు కొట్టించి అందరికీ పోస్టులో వేయడంలోనే అతడి కోరిక బయటపడింది. కానీ అతడి గురించి బాగా తెలిసిన బంధువులెవరూ ఆ ఫంక్షన్‌కి హాజరుకాకపోవడంతో అతడి కోరిక నెరవేరలేదు. తను అంత కష్టపడి అద్భుతంగా కట్టుకున్న ఇంటి గొప్పతనం, తన గొప్పతనం ఎవరికీ తెలియకుండా పోతోందే అన్న బాధ అతడిని నిలవనీయకపోతుంటే ఇంక చేసేదిలేక బంధువులని ఒక్కొక్కరినీ ప్రేమగా పిలిచి తన ఇంటిని చూపిస్తూ వాళ్ళు తన ఇంటి అందాన్ని పొగుడుతుంటే, తరువాత వాళ్ళు నలుగురికీ దాని గురించి గొప్పగా చెబుతుంటే తెలుసుకుని ఆనందపడుతున్నాడు. అందుకే అందరినీ ఒక్కసారిగా పిలవకుండా ఒక్కొక్కరినీ ఒక్కోరోజు పిలుస్తూ ఆ ఆనందాన్ని ఇన్‌స్టాల్‌మెంట్లలో అనుభవిస్తున్నాడు. అదీ అసలు రహస్యం!"



రుక్మిణి నమ్మలేనట్లుగా చూసింది. "ఇదిగో ఈ ఫ్లోరింగ్ చూసారా? మార్బుల్ రాజస్థాన్నుంచి తెప్పించాను. బాత్రూమ్‌లో ఈ పంపులు చూసారా? ఇటలీ నుంచి ఇంపోర్ట్ అయ్యాయి" అని చెబుతూ వింటున్న తమ ముఖంలోని ఆశ్చర్యాన్ని, మెచ్చుకోలునీ చూసినప్పుడు మార్కండేయులు అన్నయ్య కళ్ళలో కనిపించిన వింత ఆనందం గుర్తుకు వచ్చి ఆమెకి రామాంజనేయం చెబుతున్నది నిజమేననిపించింది.

"నిజమేనండీ..మీరు చెబుతుంటే నాకూ అనిపిస్తోంది. మాట్లాడుతున్నంతసేపూ అన్నయ్య తన ఇంటిని గురించే చెబుతున్నాడు గానీ, నా గురించి గానీ, నా బాగోగుల గురించీ గానీ ఒక్క ముక్క కూడా అడగలేదు" అంది రుక్మిణి ఆశ్చర్యంగా. ఆశ్చర్యంతోపాటూ ఆపుకోలేకుండా నవ్వు కూడా వస్తోందామెకి.

"ఎంతటి వాళ్ళకైనా ఏదో ఒక స్టేజిలో తన సంపదనీ, సాధించిన హోదానీ నలుగురికీ చూపించుకుని వాళ్ళచేత పొగిడించుకోవాలని అనిపిస్తుంది. మీ మార్కండేయులు కూడా అందుకు అతీతుడేమీ కాదు. ఆ బలహీనతే అతడికి తాత్కాలికంగా మనుషుల అవసరాన్ని గుర్తు చేసింది. అంతే తప్ప అలాంటివాళ్ళు అంత తొందరగా మారరు" అన్నాడు రామాంజనేయం.

మొత్తానికి ఎవరూ కనిపెట్టలేకపోయిన పరమరహస్యాన్ని మీరు కనుక్కున్నారు. పోనీలెండి వాడి సంగతెలా ఉన్నా ఈ వంకతో ఇన్నాళ్ళకి మా పెద్దమ్మా, వదినా బంధువులతో మనసారా గడపగలుగుతున్నారు" అంది నవ్వుతూ.

రామాంజనేయం కూడా నవ్వేడు.

☆

## పురుష ద్వేషిని కాదు

నలభైల్లోకి అడుగుపెడుతున్న టబు 'నేనీరోజు ఈ పొజిషన్లో వున్నానంటే అదంతా నా కృషి ఫలితమే. కొంతమంది క్లోజ్‌ఫ్రెండ్స్ సహాయం చేసారు, నేనింతగా ఎదిగాను. నా బెస్ట్ ఫ్రెండ్స్‌తో నాగార్జునని స్పెషల్‌గా చెప్పుకుంటాను' అని చెప్పే టబుని 'మీ పెళ్ళెప్పుడండీ?' అని అడిగామనుకోండి. 'పెళ్ళి చేసేసుకుంటేనే లైఫ్‌లో సెటిల్ అయినట్టా? పెళ్ళికి నేనేమీ వ్యతిరేకం కాదు. పెళ్ళాడేందుకు మగాళ్ళని వెతకడం అనేది నాకు సుతరామూ నచ్చదు. అలాగని నన్ను పురుషద్వేషిగా భావించకండి' అంటుంది.